సాక్షి e-paper

Print  Clip Article

Rate This Article

# రెండు కంపెనీలు కొంటాం

<u>హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:</u>

రైల్వే, ఇంజనీరింగ్ పరికరాల తయారీ సంస్థ పెన్నార్ ఇండస్ట్రీస్ భారీ విస్తరణపై దృష్టి పెట్టింది. ఈ క్రమంలో న్యూక్లియర్, స్పేస్, డిఫెన్స్ రంగంలో ఉన్న రెండు సంస్థలను కొనుగోలు చేయాలని యోచిస్తోంది. ఒక్కో కంపెనీ కోసం రూ.100 కోట్ల వరకు వెచ్చించే అవకాశముంది. ప్రస్తుతం చర్చల దశలో ఉన్న ఈ ప్రక్రియ కొద్ది రోజుల్లో కార్యరూపం దాల్చనున్నట్లు పెన్నార్ చైర్మన్ నృపేందర్ రావు తెలిపారు. అలాగే, విదేశీ మార్కెట్లలోనూ వాటా పెంచుకోవాలని చూస్తున్నట్లు చెప్పారు. అనుబంధ విభాగమైన పీఈబీఎస్ ద్వారా ఆఫ్రికాలోని టాంజానియాకు రూ.10 కోట్ల విలువైన బిల్డింగ్ కాంపోనెంట్స్‌ను సంస్థ ఎగుమతి చేస్తోంది.

## సాక్షి బిజినెస్‌తో పెన్నార్ చైర్మన్ నృపేందర్‌రావు

- న్యూక్లియర్, స్పేస్ విభాగాలపై దృష్టి
- ఒక్కో కంపెనీపై రూ.100 కోట్ల పెట్టుబడి
- రూ.30 కోట్లతో చెన్నై, ఇస్నాపూర్ ప్లాంట్ల విస్తరణ
- పీఈబీఎస్‌కు రూ.80 కోట్ల ఆర్డర్‌లు



### 2010-11లో 20 శాతం వృద్ధి..

ఈ ఆర్థిక సంవత్సరంలో పెన్నార్ ఇండస్ట్రీస్ రూ.845 కోట్ల టర్నోవర్ నమోదు చేయనుంది. ఇందులో రైల్వే ప్రాజెక్టుల ద్వారా రూ.280 కోట్ల ఆదాయం సమకూరనున్నట్లు నృపేందర్ రావు చెప్పారు. మార్కెట్ ఇప్పుడిప్పుడే పుంజుకుంటోందని, వచ్చే ఆర్థిక సంవత్సరంలో టర్నోవర్‌లో 20 శాతం వృద్ధి సాధిస్తామని ఆయన తెలిపారు. ఆర్డర్లు పెరుగుతున్న నేపథ్యంలో చెన్నైతోపాటు, హైదరాబాద్‌కు సమీపంలోని ఇస్నాపూర్ ప్లాంట్ల విస్తరణ పనులను ప్రారంభించినట్లు వివరించారు. ఇందు కోసం రూ.30 కోట్లు వెచ్చిస్తున్నట్లు నృపేందర్ రావు పేర్కొన్నారు.

### ఐదేళ్లలో రూ.500 కోట్లు..

వచ్చే ఐదేళ్లలో అనుబంధ విభాగమైన పెన్నార్ ఇంజనీర్డ్ బిల్డింగ్ సిస్టమ్స్(పీఈబీఎస్)కు రూ.500 కోట్ల ఆర్డర్లు రావొచ్చని ఆయన వెల్లడించారు. ఈ విభాగం ప్రారంభమైన 3 నెలల్లోనే రూ.80 కోట్ల ఆర్డర్ బుక్ సాధించామన్నారు. హిమాచల్ ప్రదేశ్‌లో డాక్టర్ రెడ్డీస్ నిర్మిస్తున్న ఫార్మా యూనిట్‌కు రూ.6 కోట్లు, ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌లోని అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీకి రూ.5 కోట్ల విలువైన బిల్డింగ్ కాంపొనెంట్లను పీఈబీఎస్ సరఫరా చేస్తోంది.